నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట్: హెచ్ఎండీఏ రోడ్డు అభివృద్ధి పనుల సందర్భంగా బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ శాంతకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ నిజాంపేట్, ఎంఎస్ఎస్, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిఖర విల్లాస్ నుంచి బాచుపల్లి సిగ్నల్స్ వరకు, శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, బాచుపల్లి గ్రామం, సీతారామ హోమ్స్, కౌసల్య మణిదీపం, మమత ఆసుపత్రి సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి


అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కేఎం ప్రతాప్

చింతల్: అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేఎం.ప్రతాప్ అన్నారు. బుధవారం చింతల్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణమాస బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నక్క ప్రకాష్, ఉపాధ్యక్షులు ఏనుగుల బాలకృష్ణ, శాతూర్ మహేష్, ప్రధాన కార్యదర్శి పోతరాజు మహేందర్ కుమార్, కోశాధికారి ఊరడి మల్లికార్జున్, కార్యదర్శి కారింగుల నటరాజ్, సంయుక్త కార్యదర్శి నూనె సుధాకర్, వెంకటేష్, కార్యనిర్వాహక కార్యదర్శులు అల్లం ప్రకాష్, నూనె నరసింహ, ఏనుగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వినతి


మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో పలు బస్తీలు, కాలనీలకు చెందిన ప్రజల నుంచి మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ బుధవారం వినతులు స్వీకరించారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని వారికి భరోసా కల్పించారు. బాచుపల్లిలోని పూజిత ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ కమిటీ నూతనంగా ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను కలిసి.. కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పీపీనగర్‌కు చెందిన పలువురు మహిళలు కాలనీకి మహిళా భవనాన్ని, కమ్యూనిటీహాల్‌ను కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

ఆర్టీసీ శ్రావణమాసం ఆఫర్

మూసాపేట: శ్రావణమాసం సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్‌ను తీసుకువచ్చిందని కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి బుధవారం తెలిపారు. వివాహ శుభకార్యాలకు, విహారయాత్రలకు బస్సు ఆన్ కాంటాక్ట్ పద్ధతిలో అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. శ్రావణమాసం పథకం ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ ఇస్తున్నామని, ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాయితీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం



చింతల్: దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫీ అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ ఎస్ఎల్‌బీ నగర్‌లో పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. 13 వీధుల్లో నూతన డ్రైనేజీ లైన్లు, చెట్ల కొమ్మలు తొలగించాలని, 12 వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఉపేందర్‌కు సన్మానం



నిజాంపేట్: 'మెరిటోరియస్' అవార్డు అందుకున్న బాచుపల్లి సీఐ ఉపేందర్‌ను బుధవారం ప్రగతినగర్‌కు చెందిన డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు సత్కరించారు. కీలక కేసుల్లో పక్కా దర్యాప్తు, సాక్ష్యాధారాలను సేకరించి నిందితులకు యావజ్జీవ కారాగారం, పదేళ్ల జైలు శిక్ష విధించడంలో ఉపేందర్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నాగిశెట్టి శేషారావు, ప్రసాద్ రాజు, మైలారం అశోక్, శివప్రసాద్, తరుణ్, సాయికృష్ణారెడ్డి, అశోక్ నాయక్, ఎస్ఐ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సుభాష్‌నగర్: విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు కార్పొరేటర్ హేమలతారెడ్డి తన సొంత నిధులతో బస్‌పాస్‌ల ఫీజులు చెల్లించారు. సదరు బస్‌పాస్‌లను బుధవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం యాదగిరి, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మహిళా నాయకురాలు అనిత, సుభాష్‌రెడ్డి, వాసు, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి

- అధికారులతో చర్చించిన జోనల్ కమిషనర్
- ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రణాళికలు
- నాలుగు జంక్షన్ల విస్తరణకు నిధుల మంజూరు


జంక్షన్ ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జంక్షన్ల విస్తరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో జంక్షన్‌ల ఏర్పాటు పనులను జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన ప్రణాళికలు రూపొందించి పూర్తి నివేదికను అందజేయాలన్నారు. నిధులు మంజూరు చేసి జంక్షన్‌లను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఆ దిశగా ఇంజినీరింగ్ అధికారులు పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, ఎస్ఈ చిన్నారెడ్డి, సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కృష్ణప్ప, లక్ష్మీ గణేష్, డీఈలు పాపమ్మ, రూపాదేవి, వైద్య ఆరోగ్య అధికారులు భార్గవ్ నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబా, కూకట్‌పల్లి జోనల్ ప్లానింగ్ విభాగం అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశలో నాలుగు జంక్షన్లు

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని మొత్తం నాలుగు జంక్షన్‌లను మొదటి దశలో పూర్తి చేసేందుకు గ్రేటర్ అధికారులు నిధులు మంజూరు చేశారు. రంగ- భుజంగ థియేటర్ జంక్షన్ అభివృద్ధికి రూ.80 లక్షలు, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం సమీపంలో జంక్షన్ అభివృద్ధికి రూ.1.20 కోట్లు (విద్యుత్ పోల్స్ తొలగింపు ప్రక్రియ కూడా ఇందులోనే), షాపూర్‌నగర్ జంక్షన్ అభివృద్ధికి రూ.1.70 కోట్లు, జగద్గిరి గుట్ట ప్రాంతంలో రూ.48 లక్షలు ఇలా మొదటి విడుత రెండు సర్కిళ్లకు రెండు చొప్పున జంక్షన్ పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించినట్లు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

మరికొన్ని ప్రాంతాల్లో జంక్షన్‌ల ఏర్పాటు..

సూరారం సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న చౌరస్తాను ఆధునికీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఐడీఎల్‌తో పాటు గాజులరామారం జంక్షన్‌లను కూడా ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రణాళికలు రూపొందించారు. వీటికి రెండో విడుతలో నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు సిద్ధమయ్యారు.

ప్రపంచానికి వస్త్రాలు అందించిన ఘనత చేనేతలదే..


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్

జగద్గిరిగుట్ట: ప్రపంచంలోనే వస్త్రాలు లేని రోజుల్లో ప్రపంచానికి వస్త్రాలు అందించింది చేనేత కార్మికులని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూరత్ నుంచి బతుకమ్మ చీరెలు తెప్పించి చేనేత కార్మికుల నోట్లో మట్టి కొట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, పద్మశాలి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్, కార్యనిర్వాహక అధ్యక్షులు మునిపెల్లి జనార్దన్, ప్రధాన కార్యదర్శి హరి నారాయణ, పెద్ది మల్లేశం, పాలడుగు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ అమర్నాథ్, రాజేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో

జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో పాటు సూరారం కార్పొరేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చేనేత కార్మికుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పల్ల దత్తాత్రేయ. రాజేష్, గణేష్, ప్రభాకర్, శివ, జయరాం, రాజు పాల్గొన్నారు.

పెట్రోలింగ్ ఏర్పాటు చేయరూ?

- రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్
- రాత్రి పూట పెట్రోల్ అపహరిస్తున్న దుండగులు

కుత్బుల్లాపూర్: అర్ధరాత్రి వస్తున్నారు.. రోడ్డు పక్కన పార్కు చేసి ఉన్న వాహనాల నుంచి పెట్రోల్ ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు.. ఒకటి, రెండు రోజులు కాదు.. వారం రోజులుగా జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్‌లో వరుసగా జరుగుతున్న సంఘటనలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఓ మహిళ ఒంటరిగా వెళ్తుండగా ఆమె సెల్ ఫోన్‌ను అపహరించారు. తాజాగా పార్కు చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ దొంగలించారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఓ బైకుపై ముగ్గురు వ్యక్తులు వచ్చి పెట్రోల్ దొంగతనం చేస్తున్నట్లు స్పష్టంగా స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. అయోధ్య నగర్‌కు ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక గంజాయి బ్యాచ్‌కి అడ్డాగా మారిందని స్థానికులు తెలిపారు. గంజాయి మత్తులో రోడ్డుపై వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్ అధికారులు స్పందించి స్థానికంగా పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే రోగాలు రాకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి అన్నారు. బుధవారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ ఆగం పాండుతో కలిసి విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవుల పావని జగన్ యాదవ్, బాలాజీ నాయక్, కో ఆప్షన్ సభ్యురాలు వాణీ స్టీఫెన్ పాల్, సీనియర్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, రాజ మోహన్‌రెడ్డి, నాగరాజ్, బైండ్ల నగేశ్, సాయిముదిరాజ్, సబిత, రజిత, పాఠశాల ఉపాధ్యాయులు, వెన్నెల పొదుపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మురుగును తొలగించారు


గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ లైన్



రంగారెడ్డినగర్: ఎట్టకేలకు మురుగు సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న ఐడీఏ గాంధీనగర్ పారిశ్రామికవాడలో నుంచి ప్రతి నిత్యం మురుగు పారేది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లేది. ఈ విషయమై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఓపెన్ డ్రైనేజీ ఉన్న ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీలైన్‌ను ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ బ్యాగులను వాడొద్దు

మోతీనగర్: పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ బ్యాగులను వాడవద్దని, చేతి సంచులను మాత్రమే వాడాలని లయన్స్‌క్లబ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో రోగులకు చేతి సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

– శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో వ్యర్థాలను తొలగించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం చెరువులో దోమల లార్వా నిర్మూలన కోసం ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలా క్లీనింగ్, వన మహోత్సవం వంటి కార్యక్రమాలు చేపట్టి కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మురుగు నీరు చెరువుల్లో కలవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, ఏఎంఓహెచ్ మమత, ఇరిగేషన్ ఏఈ విశ్వం, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు, అధికారులతో కలిసి మొక్క నాటిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

పచ్చదనాన్ని పెంపొందించాలి

- స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రజాప్రతినిధులు, అధికారులు
- వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన


మొక్క నాటుతున్న ఉప కమిషనర్ నరసింహ

కుత్బుల్లాపూర్ : మొక్కలు నాటి కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించాలని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం సర్కిల్ పరిధిలోని ఎంఎన్‌రెడ్డి నగర్ ఫేజ్-2 లో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ, సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శంకర్, బస్వంత్, సత్యనారాయణ, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాపునగర్‌లో..


బాపునగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్‌కే పాఠశాల విద్యార్థులు

బాపునగర్‌లోని ఆర్ఎస్‌కే పాఠశాల విద్యార్థులు పలు కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెట్లను రక్షించడం వల్ల కలిగే లాభాలను తెలిసేలా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

జగద్గిరిగుట్ట: కార్పొరేటర్ జగన్ డివిజన్ పరిధిలోని సంజయ్‌పురి కాలనీ, జగద్గిరి నగర్ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు సునందిని, గజేంద్ర బాబు, డివిజన్ మాజీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, ఇంద్ర గౌడ్, రాజ్ కుమార్, చిన్న, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను భాగస్వామ్యం చేయాలి.

దుండిగల్: సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్ దుండిగల్ మున్సిపాలిటీలో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. వర్షపు నీటి కాలువలను శుభ్రపర్చడం, లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడటం, ఆయిల్ బాల్స్, యాంటీ మలేరియా స్ప్రే చేయించడం, వాటర్ ట్యాంక్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, కొత్తగా ఇళ్లు నిర్మించి ఇంకుడు గుంతలు లేని వాటిని గుర్తించి వారికి అవగాహన కల్పించే విధంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో కలుపు మొక్కలను తొలగించడానికి ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం చేయించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి బాబు మోసెస్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, మేనేజర్ సునంద, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాత్విక్, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్: స్వచ్ఛదనం- పచ్చదనంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నీటి నిల్వ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది ఆయిల్ బాల్స్‌ను వేయడంతో పాటు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. అదే విధంగా పలు కమ్యూనిటీ నీటిట్యాంక్‌ల నుంచి నీటిని బయటకు పంపి యాంటీ లార్వా మందులను పిచికారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాని, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్


ఆయిల్ బాల్స్‌ను వేయిస్తున్న కమిషనర్ శ్రీహరి

ఆధార్ కేంద్రాన్ని పున:ప్రారంభించాలి

బాలానగర్: జీహెచ్ఎంసీ ఫిరోజ్‌గూడ వార్డు కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పున ప్రారంభించాలని తహసీల్దార్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, బీఆర్ఎస్ సహాయ కార్యదర్శి ఖాజా, సీపీఎం మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. గతంలో వార్డు కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని నడిపించారని, సాంకేతిక సమస్యతో గత సంవత్సరం ఆగస్టులో మూసివేశారన్నారు. అదే వార్డు కార్యాలయంలో ఆధార్ ప్రక్రియను పున:ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

శాశ్వత వీసీ, అధ్యాపకులను నియమించాలి

కూకట్‌పల్లి: యూనివర్సిటీలకు శాశ్వత వీసీ, అధ్యాపకులను నియమించాలని జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్‌నాయక్, పవన్‌కుమార్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని 10 విశ్వవిద్యాలయాల్లో రిక్రూట్‌మెంట్ లేక విశ్వ విద్యాలయాల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారిందన్నారు. రెండు నెలలుగా రెగ్యులర్ వీసీలను నియమించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 5 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా యూనివర్సిటీలపై దృష్టి సారించాలని కోరారు. విశ్వ విద్యాలయాల ఇన్‌చార్జి వీసీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేశారని, వారి కనుసన్నలలోనే నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సందీప్, బ్రహ్మం గౌడ్, శివకృష్ణ, విజయ్, పిల్లి సిద్ధార్థ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసు సుఖాంతం

- చిన్నారిని క్షేమంగా తల్లిచెంతకు చేర్చిన జీఆర్పీ పోలీసులు
- అదుపులో నిందితుడు

సికింద్రాబాద్ : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి కిడ్నాప్ అయిన ఐదేళ్ల బాలికను జీఆర్పీ పోలీసులు క్షేమంగా తల్లిచెంతకు చేర్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్న జావిద్, గేనియబేగంలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. గేనియబేగం తన పిల్లలను తీసుకుని జనగాంలో ఉంటున్న నాయనమ్మ దగ్గరకు వెళ్లేందుకు ఈనెల 6న సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కు చేరుకుంది. రాత్రి 8.20 గంటలకు భోజనం తీసుకుని వచ్చేందుకు వెళుతూ కుమార్తెను అక్కడున్న మరుగుదొడ్డి వద్ద కూర్చోబెట్టింది. పెద్దకుమార్తెతో కలిసి భోజనం తీసుకుని వచ్చే సరికి చిన్నకుమార్తె కనిపించలేదు. స్థానికంగా వెతికినా కనిపించకపోవడంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మెహిదీపట్నంలో నిందితుడు చిన్నారితో అనుమానస్పదంగా తిరుగుతుండగా ఆసిఫ్‌నగర్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్ నుంచి కిడ్నాప్‌కు గురైన చిన్నారి, ఆమె ఒక్కరే అని నిర్ధారించుకుని నిందితుడితో పాటు బాలికను జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.